RNI NO.TELTEL/2022/83842

PRABHAT A GAMANAM

# ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374


వరంగల్ | సంచిక 309 | సంపుటి 4 | శనివారం | 15-08-2026 | పేజీలు 4 | వెల 3/-

## జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ
# వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

- **పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ లో జాతీయ పతాకావిష్కరణ చేయనున్న మంత్రి పొంగులేటి**
- **ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ చాహత్**

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

హనుమకొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి తెలిపారు. ఉదయం 9:20 గంటలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరుకానున్నారని తెలిపారు. ఉదయం 9:30 గంటలకు మంత్రి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, అనంతరం పోలీస్ పరేడ్‌ను పరిశీలించి గౌరవ వందనం స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి హనుమకొండ జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రసంగిస్తారని కలెక్టర్ తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుల సన్మానం, సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ ప్రభుత్వ శాఖల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతిబింబించే శకటాల ప్రదర్శన నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, సంస్థలు, ఇతరులకు పురస్కారాల ప్రదానం ఉంటుందని తెలిపారు. అనంతరం జాతీయ గీతాలాపనతో వేడుకలు ముగుస్తాయని పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి తెలిపారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు,



పారిశుద్ధ్యం, పార్కింగ్, భద్రత తదితర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ వెల్లడించారు. ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర్య సమరయోధులు, అధికారులు, విద్యార్థులు, మీడియా ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి కోరారు.



## పంద్రాగస్టు వేడుకలకు
# ఖిలా వరంగల్ సిద్ధం

- **ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ డా. సత్య శారద**

వరంగల్ క్రైమ్ బ్యూరో, ప్రభాత గమనం:

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఖిలా వరంగల్‌లోని ఖుష్ మహల్ ప్రాంగణంలో శనివారం ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. ఈ నేపథ్యంలో వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద శుక్రవారం ఖుష్ మహల్ ప్రాంగణాన్ని సందర్శించి ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వేదిక, పరేడ్, సీటింగ్, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్, భద్రత, పార్కింగ్ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వాతంత్ర్య సమరయోధులు, ఆహ్వానితులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమ ప్రాంగణంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, తాగునీరు, వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. వేదిక వద్ద భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జాతీయ పండుగను గౌరవప్రదంగా, ఘనంగా నిర్వహించేలా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ డా. సత్య శారద స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. సంధ్యారాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ వై.వి. గణేష్, ఆర్‌డీఓ సుమ, తహసీల్దార్ ఇక్బాల్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# గార్లలో 'హర్ ఘర్ తిరంగా'

- **మువ్వన్నెల జెండాలతో మార్మోగిన పురవీధులు**
- **ర్యాలీలో పాల్గొన్న నాయకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు**

గార్ల,ఆగస్టు 14 (ప్రభాత గమనం ):

దేశభక్తి, జాతీయ ఐక్యత ప్రతి ఒక్కరి గుండెల్లో నింపడమే లక్ష్యంగా గార్ల మండల కేంద్రంలో "హర్ ఘర్ తిరంగా యాత్ర" శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. "మన జెండా – మన గర్వం – మన భారతం" అనే నినాదాలతో గార్ల పురవీధులన్నీ మువ్వన్నెల మయంగా మారాయి.పాఠశాల విద్యార్థులు జాతీయ జెండాలను చేతబూని, "భారత్ మాతాకీ జై" అంటూ చేసిన నినాదాలు, డిజె సౌండ్ సిస్టమ్‌పై మోగిన దేశభక్తి గీతాలు మండల కేంద్రంలో పండుగ వాతావరణాన్ని తలపించాయి.ఈ తిరంగా యాత్రలో స్థానిక ప్రభుత్వ పాఠశాల, జెడ్పీహెచ్ఎస్, సమత హైస్కూల్, నిర్మల స్కూల్, విశ్వశాంతి విద్యాలయాలకు చెందిన 7, 8, 9 తరగతుల విద్యార్థిని, విద్యార్థులు, వారి ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి బీజేపీ మైనార్టీ మోర్చా మాజీ కార్యదర్శి రావుక విమల్ కుమార్ జైన్ తన కుటుంబ సమేతంగా హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులకు స్వయంగా స్నాక్స్ పంపిణీ చేస్తూ, వారిలో ఉత్సాహాన్ని నింపారు.కార్యక్రమంలో గార్ల మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు నక్క శివకృష్ణ యాదవ్ మాట్లాడుతూ... "స్వాతంత్ర్య స్ఫూర్తిని, దేశభక్తిని చాటేందుకు ప్రతి





ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను గౌరవంగా ఎగురవేయాలి. ప్రజాస్వామ్య దేశంలో జాతీయ జెండా మన అందరి గర్వకారణం" అని పిలుపునిచ్చారు. మండల ప్రజలు, యువత, నాయకులు ఈ యాత్రలో భాగస్వాములై కార్యక్రమాన్ని మహోద్యమంగా మార్చి విజయవంతం చేసినందుకు అభినందనలు తెలిపారు.ఈ వేడుకలో గార్ల 8వ వార్డు సభ్యురాలు గుగులోత్ భారతి, దేవా, వీరస్వామి, బుచ్చిబాబు, రాంబాబు, గణేష్, విజయ్, సతీష్, వీర్య నాయక్, వాసు, అజ్మీర రామ్, పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.



P-02_Layout 2 15-Aug-26 12:49 AM Page 1






# ముత్యాలమ్మ పండుగలో రాజకీయ రంగు

- తరతరాలుగా ఐక్యంగా సాగుతున్న ఉత్సవానికి రాజకీయ రంగు
- పండుగ నిర్వహణ పేరుతో విభేదాలు సృష్టిస్తున్నారంటూ ఆరోపణలు
- ఆచారాలను పక్కనపెట్టి రాజకీయ జోక్యం ఎందుకంటున్న స్థానికులు
- ఊరి పెద్దలు, అధికారులు జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి
- కొత్త నిబంధనలు.. కొత్త కమిటీలు.. ప్రజల్లో అయోమయం
- అరిష్టం పేరుతో ప్రచారం.. భయాందోళనలో సామాన్య ప్రజలు
- అమ్మవారి ఉత్సవాలను రాజకీయ వేదికగా మార్చొద్దని డిమాండ్
- రాజకీయాలకు దూరంగా ఉంచాలని కోరుతున్న ప్రజలు

కేసముద్రం,ఆగస్టు 14 (ప్రభాత గమనం):

తరతరాలుగా భక్తిశ్రద్ధలు, ఐక్యతతో నిర్వహించుకుంటున్న ముత్యాలమ్మ గ్రామ పండుగపై కేసముద్రం మున్సిపాలిటీలో రాజకీయ నీడలు పడుతుండటం పట్ల స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. దశాబ్దాలుగా ఊరి ప్రజలంతా కులమతాలకు అతీతంగా, ఏకతాటిపై నిలిచి జరుపుకునే అమ్మవారి ఉత్సవాల్లోకి సడన్‌గా రాజకీయ జోక్యం, కొత్త నిబంధనలు రావడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది.మున్సిపాలిటీలో పుట్టి పెరిగిన ప్రతి ఒక్కరూ ఈ పండుగను తమ సొంత ఇంటి వేడుకలా భావించి నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అయితే, ఇటీవల పండుగ నిర్వహణ కమిటీల పేరుతో, కొత్త సంప్రదాయాల నెపంతో ఊరి ప్రజల మధ్య విభేదాలు సృష్టించేందుకు కొందరు కుట్రలు పన్నుతున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఏ ఊరి పరిధిలో వారే నిర్వహించు కుంటే బాగుంటుందని,పండల సంస్కృతి లో రాజకీయ రంగు పులమడం బాగా లేదని పలువురు అంటున్నారు.అమ్మవారి పండుగను సరిగ్గా నిర్వహించకపోతే గ్రామానికి అరిష్టం జరుగుతుంది" అంటూ కొందరు ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేస్తున్నారని, దీనివల్ల సామాన్య ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.పవిత్రమైన అమ్మవారి ఉత్సవాలను రాజకీయ ప్రయోజనాల కోసం వేదికగా మార్చవద్దు.నిరూపణ లేని ప్రచారాలతో ప్రజలను భయపెట్టే యత్నాలను తక్షణమే ఆపాలి.పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాల ప్రకారమే ఐకమత్యంతో పండుగను నిర్వహించాలి. అమ్మవారి పండుగ అనేది భక్తికి, గ్రామీణ ఐక్యతకు ప్రతీకగా నిలవాలి తప్ప, స్వార్థ రాజకీయాలకు నిలయంగా మారకూడదని కేసముద్రం ప్రజలు స్పష్టం చేస్తున్నారు. ఊరి పెద్దలు, అధికారులు స్పందించి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని కోరుతున్నారు.

## ఇంటెలిజెన్స్ ఎస్పీకి రాష్ట్రపతి పోలీస్ పతకం

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :



స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగం ఎస్పీ రేగట్టె జగదీశ్వర్ రెడ్డికి ప్రతిష్టాత్మక రాష్ట్రపతి పోలీస్ పతకం (విశిష్ట సేవ) లభించింది. కేంద్ర హోంశాఖ, భారత ప్రభుత్వం ఈ పురస్కారాన్ని ప్రకటించింది. ఇంటెలిజెన్స్ వంటి కీలకమైన విభాగంలో ఆయన అందించిన దీర్ఘకాలిక, విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ పతకం లభించింది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగంలో ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న జగదీశ్వర్ రెడ్డి, రేగట్టె గోపాల్ రెడ్డి కుమారుడు. ఆయన 1969 జూన్ 10న జన్మించారు. పోలీస్ శాఖలో అంకితభావంతో పనిచేస్తూ అనేక పురస్కారాలను ఆయన అందుకున్నారు. 2005లో కఠిన సేవా పతకం, 2009లో ఉత్తమ సేవా పతకం, 2011లో ముఖ్యమంత్రి గ్యాలంటరీ మెడల్, 2014లో అంతరిక్ సురక్షా పతకం, 2017లో ఇండియన్ పోలీస్ మెడల్, 2021లో మహోన్నత సేవా పతకం అందుకున్నారు. 2006లో ఉగ్రవాదిని పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించినందుకు సీబీఐ నుంచి కూడా ప్రశంసలు అందుకున్నారు. ఆయన సేవా రికార్డులో అత్యుత్తమ పనితీరుకు సంబంధించి 85 ప్రశంసా ఎంట్రీలు, 8 ప్రశంసా పత్రాలు, 2 ప్రత్యేక ప్రశంసలు ఉన్నాయి. ఇవి ఆయన వృత్తిపరమైన నిబద్ధత, సమర్థతకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. రాష్ట్రపతి పోలీస్ పతకం ప్రకటించడంపై ఇంటెలిజెన్స్ ఏడీజీపీ విజయ్ కుమార్ ఐపీఎస్‌తో పాటు పలువురు పోలీసు ఉన్నతాధికారులు జగదీశ్వర్ రెడ్డిని అభినందించారు. పోలీసు శాఖకు ఆయన అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా ప్రశంసించారు.





## కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సమ్మయ్య గౌడ్‌కు సన్మానం

కేసముద్రం ఆగస్టు 14 (ప్రభాత గమనం ):

కాంగ్రెస్ పార్టీ కేసముద్రం మండల నూతన అధ్యక్షుడిగా నియమితులైన చిలువేరు సమ్మయ్య గౌడ్ ను గౌడ సంఘం నాయకులు, పెద్దలు ఘనంగా సత్కరించారు.శుక్రవారం మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. సమ్మయ్య గౌడ్ మండల పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం పట్ల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి ప్రత్యేక శుభాకాంక్షలు అందజేశారు. సమ్మయ్య గౌడ్ నాయకత్వంలో మండలంలో పార్టీ బలోపేతంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సన్మాన కార్యక్రమంలో గౌడ సంఘం ముఖ్య నాయకులు, కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షులు బబ్బూరి ఉప్పలయ్య, మోడం వెంకటేశ్వర్లు మెడి ఉపేందర్ తండ వెంకన్న, పుట్ట ప్రభాకర్, రాంపల్లి వెంకన్న,ఉమ్మగాని మల్లయ్య, చింతనూరి వెంకన్న, జోగు రవీందర్, గిరగాని వీరభద్ర, కదిరి సోమయ్య యాదగిరి,మెడి వెంకటేశ్వర్లు అర్పణపల్లి గౌడ సంఘం సొసైటీ అధ్యక్షుడు గంధసిరి యాకన్న తదితరులు పాల్గొన్నారు.



# ఆశ్రమ పాఠశాలలో ఎమ్మెల్యే మురళి నాయక్ తనిఖీ

- **10వ తరగతి విద్యార్థులకు పాఠాలు చెప్పిన ఎమ్మెల్యే**

మహబూబాబాద్ ఆగస్టు 14(ప్రభాత గమనం):

మహబూబాబాద్ పట్టణంలోని కస్తూర్బా బాలికల ఆశ్రమ పాఠశాలను ఎమ్మెల్యే డా. భూక్యా మురళి నాయక్ శుక్రవారం నాడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా పాఠశాలకు చేరుకున్న ఎమ్మెల్యే విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యా బోధన, వసతి, భోజనం, తాగునీరు, పరిసరాల పరిశుభ్రత తదితర సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులతో ఎమ్మెల్యే మురళి నాయక్ కొంత సమయం గడిపారు. విద్యార్థులతో సరదాగా మాట్లాడుతూనే ఎల్నినో ప్రభావం గురించి వారికి అవగాహన కల్పించారు. ఎల్నినో వల్ల వాతావరణంలో చోటుచేసుకునే మార్పులు, ఉష్ణోగ్రతలు పెరగడం, వర్షపాతం ప్రభావితం కావడం వంటి అంశాలను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా వివరించారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాల్లోని అంశాలను కేవలం చదవడమే కాకుండా, వాటి వెనుక ఉన్న విషయాలను అర్థం చేసుకుని చదవాలని ఎమ్మెల్యే సూచించారు. ముఖ్యంగా 10వ తరగతి విద్యార్థులు తమ చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, పరీక్షల్లో మంచి మార్కులు సాధించేలా ఇప్పటి నుంచే ప్రణాళికతో ముందుకు సాగాలని చెప్పారు. "మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది. కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు. మీ తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చేలా మంచి ఫలితాలు సాధించాలి" అని ఎమ్మెల్యే మురళి నాయక్ విద్యార్థులకు ప్రోత్సాహం అందించారు. కార్యక్రమంలో ఎమ్మమహబూబా వెంట మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ గూగులోత్ జ్యోతి రమేష్,పట్టణ కౌన్సిలర్ లు ,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు...

# మరిపెడలో వన మహోత్సవం

డోర్నకల్ ఆగస్టు 14(ప్రభాత గమనం):

మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో శుక్రవారం వన మహోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్ మాట్లాడుతూ..పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. మొక్కల పెంపకం ద్వారా పచ్చదనం పెంపొందించడంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు పాల్గొన్నారు.



# సైబర్ భద్రతే స్వేచ్ఛకు కొత్త అర్థం

- **'సురక్ష కా తిరంగా'తో ప్రజల్లో సైబర్ అవగాహనకు టీజీసీఎస్బీ శ్రీకారం**



ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్బీ) ఆధ్వర్యంలో 'సురక్ష కా తిరంగా – సైబర్ స్వతంత్ర తెలంగాణ దిశగా' కార్యక్రమాన్ని నిర్వహించారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ డీజీపీ, హెడ్ ఆఫ్ పోలీస్ ఫోర్స్ సి.వి. ఆనంద్, హోంశాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, టీజీసీఎస్బీ డైరెక్టర్ శిఖా గోయల్, ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జున తదితరులు పాల్గొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం సాధించిన స్ఫూర్తితోనే ప్రజలకు డిజిటల్ స్వేచ్ఛ, భద్రత కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆన్‌లైన్‌లో ఎదురయ్యే మోసాలు, ముఖ్యంగా పెట్టుబడులు, స్టాక్ ట్రేడింగ్, బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ల పేరుతో జరిగే సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. త్రివర్ణ పతాక స్ఫూర్తితో రూపొందించిన ప్రచారంలో కాషాయం – అప్రమత్తంగా ఉండండి, తెలుపు – అవగాహన కలిగి ఉండండి, ఆకుపచ్చ – సురక్షితంగా ఉండండి అనే సందేశాలను ప్రజలకు అందిస్తున్నారు. ఆన్‌లైన్‌లో వచ్చే సందేశాలు, కాల్స్, లింకులు, పెట్టుబడి అవకాశాలను వెంటనే నమ్మకుండా ముందుగా ధృవీకరించుకోవాలని సూచించారు. తెలంగాణలో సైబర్ నేర బాధితులు కోల్పోతున్న ఆర్థిక నష్టాల్లో సుమారు 60 శాతం పెట్టుబడి మోసాల వల్లే జరుగుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ముఖ్యంగా స్టాక్ మార్కెట్‌లో అధిక లాభాలు వస్తాయంటూ నకిలీ యాప్‌లు, వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియా ప్రకటనల ద్వారా ప్రజలను ఆకర్షించి మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. టీజీసీఎస్బీ డైరెక్టర్ శిఖా గోయల్ మాట్లాడుతూ సైబర్ నేరాలను అరికట్టడంలో తెలంగాణ దేశంలోనే ముందంజలో ఉందన్నారు. 2025లో దేశవ్యాప్తంగా సైబర్ నేర ఫిర్యాదులు 24 శాతం పెరిగినప్పటికీ తెలంగాణలో 3 శాతం తగ్గుదల నమోదైందని తెలిపారు. ఆర్థిక నష్టాలు జాతీయ స్థాయిలో 3 శాతం తగ్గగా, తెలంగాణలో 20.2 శాతం తగ్గినట్లు వివరించారు. 2026 తొలి అర్ధభాగంలో రాష్ట్రంలో సైబర్ నేర ఫిర్యాదులు 10.2 శాతం, ఆర్థిక నష్టాలు 26.8 శాతం తగ్గాయని వెల్లడించారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన ప్రగతి సమీక్షలో సైబర్ నేరాల నియంత్రణ, దర్యాప్తు, జాతీయ సైబర్ నేర వేదికల వినియోగం వంటి అంశాల్లో తెలంగాణ మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. రాష్ట్రంలోని సైబర్ నేర బాధితులకు సత్వర సహాయం అందించేందుకు పోలీసు వ్యవస్థ నిరంతరం పనిచేస్తోందన్నారు. ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున మాట్లాడుతూ సైబర్ మోసాల నుంచి రక్షించుకోవడానికి ప్రజల్లో అవగాహన, అప్రమత్తత అత్యంత అవసరమన్నారు. ఎంత నమ్మశక్యంగా కనిపించినా ఆన్‌లైన్ సందేశాలను వెంటనే నమ్మవద్దని, ఒత్తిడి లేదా అత్యవసర పరిస్థితిని సృష్టించే కాల్స్, మెసేజ్‌లకు తొందరపడి స్పందించవద్దని సూచించారు. ముఖ్యంగా తల్లిదండ్రులు, తాతయ్యలు, అమ్మమ్మలకు యువత సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలని కోరారు. డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ సైబర్ నేరాలను కేవలం పోలీసుల చర్యలతోనే పూర్తిగా అరికట్టడం సాధ్యం కాదన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండటం, అనుమానాస్పద లింకులు, కాల్స్, యాప్‌లకు దూరంగా ఉండటం, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు సమాచారం, ఓటీపీలు ఇతరులతో పంచుకోకపోవడం ద్వారా మోసాలను గణనీయంగా తగ్గించవచ్చన్నారు. విద్యార్థులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, సీనియర్ సిటిజన్లు తదితరులకు ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సీనియర్ సిటిజన్లు, వివిధ సామాజిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. సైబర్ భద్రతపై ఇంటరాక్టివ్ స్టాళ్లు, ఆటలు, అవగాహన సెషన్లు నిర్వహించారు. సైబర్ భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. సైబర్ నేరాలపై వినూత్నంగా అవగాహన కల్పించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే 'గోల్డెన్ అవర్'లో చర్యలు తీసుకుని బాధితుల సొమ్మును నిలిపివేసే లేదా రికవరీ చేసే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. ప్రజల అప్రమత్తత, పోలీసుల సమర్థవంతమైన దర్యాప్తు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో సైబర్ సురక్షిత తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా టీజీసీఎస్బీ పనిచేస్తోందని అధికారులు పేర్కొన్నారు.

# 5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :




భూపాలపల్లి జిల్లా ఘనపురం పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 5 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని సిసిఎస్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు సిసిఎస్ బృందం తనిఖీలు చేపట్టగా, రవినగర్, గ్రామానికి చెందిన తుర్పాటి రాజశేఖర్ (30) అక్రమంగా పిడిఎస్ బియ్యాన్ని నిల్వ ఉంచినట్లు గుర్తించారు. దీంతో అతని వద్ద ఉన్న సుమారు 5 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడు తుర్పాటి రాజశేఖర్‌ను, స్వాధీనం చేసుకున్న పిడిఎస్ బియ్యాన్ని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం ఘనపురం పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడం, రవాణా చేయడం, విక్రయించడం వంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# బెరువాడలో ఘనంగా 'తిరంగా ర్యాలీ'

- **జాతీయ జెండాతో హోరెత్తిన దేశభక్తి**

కేసముద్రం ఆగస్టు 14(ప్రభాత గమనం):




80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు , మరియు వందేమాతరం' 150 ఏళ్ల వైభవపూర్వక చరిత్ర స్ఫూర్తితో శుక్రవారం ఉదయం కేసముద్రం మండలం బెరువాడ గ్రామంలో 'తిరంగా జెండా ర్యాలీ' అత్యంత వైభవంగా జరిగింది. బానోతు రవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ జెండాలు చేతబూని ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామం మొత్తం దేశభక్తి నినాదాలతో హోరెత్తింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల అధ్యక్షులు ఉప్పునూతల రమేష్, ప్రధాన కార్యదర్శి బానోతు రాము హాజరై ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీలో బోడ వినోద్, మండల ఎస్సీ మోర్చా అధ్యక్షులు పూర్ణకంటి భాస్కర్, బెరువాడ గ్రామ సర్పంచ్ మీసం విజయ లక్ష్మీనారాయణ, ముదిగిరి సాంబయ్య, కొండబోయిన సంపత్, అనిల్, రాజేందర్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బీరం జనార్దన్ రెడ్డి, పాఠశాల అధ్యాపక బృందం మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



ప్రభాత గమనం

వరంగల్, శనివారం, 15-08-2026

# ఏడాదిలోగా రాంపురం-గార్ల హైలెవల్ బ్రిడ్జి పూర్తి

- ఎమ్మెల్యే కోరం కనకయ్య
- గార్ల మండలంలో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన
- అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
- సీతంపేట, పెద్దకిష్టాపురంలో ఇందిరమ్మ ఇళ్లు, మినీ బ్యాంక్ ప్రారంభం



గార్ల ఆగస్టు 14 (ప్రభాత గమనం):

రాంపురం – గార్ల మధ్య అత్యంత కీలకమైన పాకాల ఏటి హైలెవల్ బ్రిడ్జి నిర్మాణాన్ని నిర్ణీత కాలపరిమితిలోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పష్టం చేశారు. శుక్రవారం గార్ల మండలంలో ఆయన విస్తృతంగా సుడిగాలి పర్యటన నిర్వహించి, పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కనకయ్య మాట్లాడుతూ... ఎన్నో ఏళ్లుగా రాంపురం, మద్దివంచ పరిసర గ్రామాల ప్రజలకు రవాణా రహితంగా మారిన పాకాల చెక్ డ్యామ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ఈ బ్రిడ్జి నిర్మాణం చేపట్టామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డిల సహకారంతో ఈ నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా ఏడాదిలోగా పూర్తి చేయాలని ఇరిగేషన్, కాంట్రాక్ట్ అధికారులను ఆదేశించారు.సీతంపేట గ్రామంలో సర్పంచ్ గుగులోత్ వీర్యా నాయక్ ఆధ్వర్యంలో తడి, పొడి చెత్త సేకరణ బకెట్లను పంపిణీ చేశారు. చెత్తను వేరు చేసి సిబ్బందికి అందిస్తూ పరిశుభ్రతలో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.గార్ల ప్రభుత్వ కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన శవపరీక్ష (పోస్ట్‌మార్టం) కేంద్రాన్ని ప్రారంభించారు. ఆసుపత్రి వంటగదిని పరిశీలించి, రోగులకు అందే పౌష్టికాహార నాణ్యతను తనిఖీ చేశారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.పెద్దకిష్టాపురం సర్పంచ్ గంగావత్ రామ్ సింగ్ నాయక్‌తో కలిసి గ్రామపంచాయతీ కార్యాలయం, ఇందిరమ్మ ఇళ్లు, మినీ బ్యాంకును ప్రారంభించారు.ప్రజా ప్రభుత్వంలో నిరుపేదలు ఆత్మగౌరవంతో జీవించేలా ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంతింటి కల సాకారమవుతోందని ఎమ్మెల్యే ఆనందం వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.పాకాల ఏటి హై లెవెల్ బ్రిడ్జి మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే కోరం కనకయ్యతో పాటు పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్‌ను సీపీఐ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాళ్లపల్లి కృష్ణ గౌడ్, ఎంపీడీవో మంగమ్మ, తహశీల్దార్ శారద, వ్యవసాయాధికారి రామారావు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్, సీపీఐ పార్టీల నాయకులు మరియు గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.




# కమలాపురం శివారులో వ్యక్తి మృతి

- దంపతులపై హత్య కేసు
- భార్యతో అనుచితంగా ప్రవర్తించడంపై వివాదం..
- దాడిలో మృతి చెందినట్లు పోలీసుల వెల్లడి

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

ములుగు జిల్లా కమలాపురం గ్రామ శివారులోని వ్యవసాయ భూమిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. భార్యతో అనుచితంగా ప్రవర్తిస్తున్నాడనే కారణంతో జరిగిన వివాదం చివరకు దాడికి దారితీసి, వ్యక్తి మృతిచెందినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. పోలీసుల వివరాల ప్రకారం.. కమలాపురం గ్రామ శివారులోని పుల్లంచెట్టి శ్యామ్‌కుమార్ వ్యవసాయ భూమిలో కొప్పుల నర్సింహారావు (40), ఆయన భార్య కొప్పుల లక్ష్మి (55), గుండి గూడెం గ్రామానికి చెందిన తాటి శేఖర్‌కుమార్ (32) కలిసి వ్యవసాయ పనులు చేసుకుంటూ అక్కడే ఉంటున్నారు. గత కొంతకాలంగా తాటి శేఖర్‌కుమార్, కొప్పుల లక్ష్మి తో అనుచితంగా ప్రవర్తిస్తున్నాడని, ఈ విషయంపై నర్సింహారావు పలుమార్లు హెచ్చరించినప్పటికీ అతని ప్రవర్తనలో మార్పు రాలేదని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 12న రాత్రి సుమారు 10 గంటల సమయంలో శేఖర్‌కుమార్ మరోసారి నర్సింహారావుతో గొడవకు దిగినట్లు పేర్కొన్నారు. భార్య విషయంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో నర్సింహారావు, లక్ష్మి కలిసి శేఖర్‌కుమార్‌పై దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన శేఖర్‌కుమార్ మృతి చెందినట్లు వెల్లడించారు. ఏటూరునాగారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి. సూర్యప్రకాశ్, మంగపేట ఎస్సై టీవీఆర్ సూరి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించి కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై ఏటూరునాగారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి. సూర్యప్రకాశ్, మంగపేట ఎస్సై టీవీఆర్ సూరి ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.




# బైక్ చోరీల నిందితుడి అరెస్ట్

- మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

హనుమకొండ నగరంలోని హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో వరుసగా జరుగుతున్న ద్విచక్ర వాహనాల దొంగతనాల కేసులను ఛేదించిన పోలీసులు ఓ నిందితుడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి మూడు బైకులను స్వాధీనం చేసుకున్నారు. హనుమకొండ ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ద్విచక్ర వాహనాల చోరీలపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు విశ్వసనీయ సమాచారం మేరకు రామ్‌నగర్‌కు చెందిన మహమ్మద్ ముజాహిద్ (34)ను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో అతను పలు బైక్ దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ అవసరాలతో పాటు వ్యక్తిగత ఖర్చుల కోసం సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో బైకులను దొంగిలించి, వాటిని విక్రయించేందుకు ప్రయత్నించినట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. సీసీఎస్, హనుమకొండ పోలీసులు సంయుక్తంగా చేపట్టిన చర్యల్లో నిందితుడిని పట్టుకుని, అతని ఇంటి వద్ద దాచిపెట్టిన మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ ప్రజలకు పలు సూచనలు చేశారు. ద్విచక్ర వాహనాలను పార్క్ చేసే సమయంలో తప్పనిసరిగా హ్యాండిల్ లాక్ చేయాలని, సాధ్యమైనంత వరకు సురక్షితమైన ప్రదేశాల్లోనే వాహనాలను నిలిపి ఉంచాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాల కదలికలు కనిపిస్తే వెంటనే సమీప పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# సమర్థవంతమైన పోలీసింగ్..

- మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి
- జిల్లా ఎస్పీ డా. శబరీష్

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :




వార్షిక తనిఖీలలో భాగంగా జిల్లా ఎస్పీ చిన్నగూడూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌కు చేరుకున్న మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, ని పోలీస్ సిబ్బంది గౌరవ వందనం స్వీకరించారు . అనంతరం జిల్లా ఎస్పీ పోలీస్ స్టేషన్ ప్రాంగణం, వివిధ గదులను పరిశీలించి స్టేషన్ నిర్వహణ తీరును పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లోని పెండింగ్ పిటిషన్లు, పిటిషన్ రిజిస్టర్ తదితర రికార్డులను తనిఖీ చేసి, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించి బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల సందర్శనలు, విలేజ్ పోలీస్ ఆఫీసర్స్ ద్వారా సేకరిస్తున్న నేర సమాచారం, గ్రామాల్లోని పరిస్థితులపై ఎస్పీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, నేరాలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించి పోలీస్ అధికారులకు చేరవేయాలని సూచించారు. బ్లూ కోల్ట్స్ సిబ్బందితో మాట్లాడుతూ.. వారి విధులు, బీట్ నిర్వహణ, అత్యవసర సమయంలో సంఘటనా స్థలానికి చేరుకునే సమయం తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అత్యవసర సమయంలో వేగంగా పోలీస్ సేవలు అందేలా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లోని ఫైల్స్, రికార్డులు, కేసు ఫైల్స్ తదితరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, కేసుల పరిష్కారం, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై ఎస్ఐ మరియు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తనిఖీ అనంతరం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఎస్పీ డా. శబరీష్, మొక్కను నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని సిబ్బందికి సూచించారు.



# చెన్నూరు సబ్ స్టేషన్ ఎదుట రైతుల ధర్నా

- నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయని రైతుల ఆవేదన
- కరెంట్ ఇవ్వాలని రైతుల డిమాండ్

జనగామ, ఆగస్టు 14(ప్రభాత గమనం):

పాలకుర్తి మండలం, మంచుప్పుల గ్రామంలో గత వారం రోజులుగా వరి నాట్లు సాగు చేసుకుంటున్న రైతులకు కరెంటు అంతరాయం తీవ్రంగా ఉన్నందున రోడ్డుపై బైఠాయించిన రైతులు శుక్రవారం నాడు ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. పంటలు వేసుకోమంటారు కానీ పంటలకు నీళ్లు ఇవ్వరని,మోటార్లు నడపడానికి కరెంటు ఇవ్వరు,చెరువుల్లో నీళ్లు లేవు,బోర్లలో నీళ్లు ఉన్నా విద్యుత్ లేక రైతు ఏం చేయాలి..? అని ప్రశ్నించారు. వేల రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతు పంట కళ్లముందే ఎండిపోతుంటే ఈ ప్రభుత్వానికి కనీసం కనికరం లేదా? రైతు ఓటు కావాలి రైతు కష్టం మాత్రం పట్టదా అని నిలదీశారు. కుర్చీ కోసం హామీలు ఇచ్చి కుర్చీలో కూర్చున్నాక రైతులను గాలికి వదిలేస్తారా అని మండి పడ్డారు.రైతు బతికితేనే వ్యవసాయమని, వ్యవసాయం బతికితేనే రాష్ట్రం అని తెలిపారు.కరెంటు ఇవ్వలేని చేతకాని ప్రభుత్వం రైతుల సహనాన్ని పరీక్షించొద్దని,రైతు ఆగ్రహం కట్టలు తెంచుకుంటే అధికార పీఠాలే కదిలిపోతాయని వాళ్ళు హెచ్చరించారు.

# జనగణన-2027'పై కీలక నోటిఫికేషన్

- 40 ప్రశ్నలతో కూడిన జాబితాను నోటిఫై చేసిన కేంద్రం

న్యూఢిల్లీ,ప్రభాతగమనం ఆగస్టు14: దేశవ్యాప్తంగా చేపట్టనున్న 'జనగణన–2027'పై కేంద్ర హోంశాఖ కీలక నోటిఫికేషన్ విడుదల చేసింది. స్వాతంత్ర్యం అనంతరం తొలిసారిగా సమగ్ర కుల గణన చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. జనగణనలో పౌరులను అడిగే 40 ప్రశ్నలతో కూడిన జాబితాను రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నోటిఫై చేసింది. జనగణన ప్రశ్నావళిలోని 10వ ప్రశ్నగా ఎస్సీ, ఎస్టీ, కులానికి సంబంధించిన వివరాలను నమోదు చేసేందుకు ప్రత్యేక అవకాశం కల్పించారు. దేశంలోనే తొలిసారిగా యాప్‌లు, డిజిటల్ సాధనాల ద్వారా జనాభా లెక్కల సేకరణ చేపట్టనున్నారు. 15 రోజుల పాటు స్వయంగా వివరాలను నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పించనున్నారు. రూ.11,718.24 కోట్ల అంచనా వ్యయంతో జనగణన–2027ను రెండు దశల్లో నిర్వహించనున్నారు. తొలి దశలో 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య గృహాల నమోదు, వసతులకు సంబంధించిన వివరాల సేకరణ చేపట్టనున్నారు. రెండో దశలో 2027 ఫిబ్రవరిలో జనాభా, విద్య, ఉపాధి, కులానికి సంబంధించిన వివరాల సేకరణ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. సెన్సస్ యాక్ట్, 1948లోని సెక్షన్ 15 ప్రకారం పౌరుల వ్యక్తిగత సమాచారానికి పూర్తి చట్టబద్ధ రహస్య రక్షణ ఉంటుంది.



# కల్వాల మోడల్ స్కూల్లో ఘనంగా తీజ్ వేడుకలు

కేసముద్రం ఆగస్టు 14(ప్రభాత గమనం):

మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలల కల్వాలలో గిరిజన సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే తీజ్ పండుగను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరిమి నవీన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాని ఉద్దేశించి మాట్లాడుతూ... గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతి ఆరాధన, పంటల సమృద్ధి, సుఖసంతోషాలకు ప్రతీకగా తీజ్ పండుగను నిర్వహిస్తారని ఈ సందర్భంగా వివరించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి సాంస్కృతిక కార్యక్రమాలు, తీజ్ నృత్యాలతో అలరించారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్ సోమయ్య ,వీరబాబు ,శ్రీదేవి అరుణా, హెల్త్ కేర్ ప్రవళిక, కంప్యూటర్ ఆపరేటర్ రమ్య ,శ్వేత రేణుక కృష్ణ, నాయక్ పూర్ణ నాయక్, విద్యార్థిని ,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# రాయపర్తి పీహెచ్సీని తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య శుక్రవారం పరకాల ప్రాంత పరిధిలోని రాయపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించి వాటిని ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యాన్ని తప్పనిసరిగా పాటించాలని డీఎంహెచ్ఓ ఆదేశించారు. ఆసుపత్రిలోని మందుల నిల్వలను క్రమబద్ధంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఒకే రకమైన మందులకు వేర్వేరు గడువు తేదీలు ఉన్నప్పుడు ముందుగా గడువు ముగిసే మందులను ముందుగా వినియోగించే విధానాన్ని తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. గడువు ముగిసిన మందులను నిబంధనల ప్రకారం సురక్షితంగా తొలగించాలని సూచించారు. అనంతరం శస్త్రచికిత్స గదిని తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ అక్కడి పరికరాలు, నిర్వహణ, పరిశుభ్రతను పరిశీలించారు. శస్త్రచికిత్స గదిలో పరిశుభ్రమైన వాతావరణాన్ని కొనసాగించాలని, అవసరమైన వైద్య పరికరాలను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

## వర్షాకాల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ప్రస్తుతం వర్షాకాలం కొనసాగుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎంహెచ్ఓ సూచించారు. ప్రతిరోజూ జ్వరాల సర్వే నిర్వహించి జ్వర లక్షణాలు ఉన్న వారిని గుర్తించాలని, అవసరమైన వారికి వెంటనే వైద్య సేవలు అందించాలని తెలిపారు. దోమల వృద్ధిని అరికట్టేందుకు ప్రతి వారం పొడి దినోత్సవ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి దోమల లార్వాను తొలగించాలని, అవసరమైన ప్రాంతాల్లో దోమల లార్వా నివారణ మందును వినియోగించాలని తెలిపారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పాలకవర్గాలు, ఆరోగ్య సహాయకులు, ఏఎన్ఎంలు, క్షేత్రస్థాయి సిబ్బంది, క్షేత్ర పర్యవేక్షకులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సంబంధిత శాఖలతో సమన్వయ సమావేశాలు నిర్వహిస్తూ సీజనల్ వ్యాధులపై ప్రజలకు ముందస్తు అవగాహన కల్పించాలని, వ్యాధుల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులకు హాజరై, సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని డీఎంహెచ్ఓ తెలిపారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం లేదా అసమర్థతకు పాల్పడే వారిపై నిబంధనల ప్రకారం క్రమశిక్షణ చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ తనిఖీలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ వి. శ్రీనాథ్, ఆరోగ్య విద్యాధికారి శిలగాని రాజ్‌కుమార్, మధ్యస్థాయి ఆరోగ్య సంరక్షణ ప్రదాత డాక్టర్ మాధవి, సిబ్బంది నర్సులు, ఏఎన్ఎంలు, ఆరోగ్య సహాయకులు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374